

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

భీమడోలు: రైతుల సమస్యల ఏప్రిల్ ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రైతు సంఘం భీమడోలు మండల శాఖ సమావేశం పూళ్లలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలో నిర్వహించే కార్మిక కర్షక ఐక్యత ర్యాలీ లక్షలాది మంది భాగస్వామ్యంతో కొనసాగుతుందన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. స్వామినాధన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి ధరకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలని, మద్దతు ధరకు గ్యారెంటీ చట్టం తేవాలని కోరారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం అమలు చేసి రైతుల రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కట్టా భాస్కరరావు, శ్రీరామచంద్రమూర్తి, జి.కృష్ణ బాలాజీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..!



ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్ర ఇబ్బందులు

రబీలోనైనా సమస్యలు లేకుండా ప్రణాళిక రూపొందించేనా!

వెంటాడిన రవాణా, తేమశాతం నిర్ధారణ, తూకం సమస్యలు

మిల్లర్లకు సొమ్ములు ఎదురు చెల్లించాల్సిన ఘోరమైన పరిస్థితి

సంచులు అందక రైతులు పడ్డ కష్టాలు వర్ణనాతీతం

అడ్డగోలు నిబంధనలతో అన్నదాత అష్టకష్టాలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ పంట దగ్గరపడుతున్న కొద్దీ రైతుల్లో గుబులు నెలకొంది. ఖరీఫ్‌లో మాదిరిగానే రబీలోనూ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తప్పవా అన్న భయం అన్నదాతను నిద్రలేకుండా చేస్తోంది. రబీలోనైనా ధాన్యం కొనుగోలు సమస్యలు లేకుండా చూడాలని రైతులు వేడుకుంటున్నారు. రబీ ధాన్యం కొనుగోలు ప్రణాళికల సమయంలో ఖరీఫ్‌లో ఎదురైనా సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తారా.. లేక రైతులను మళ్లీ ఇబ్బందులకు గురిచేస్తారా అన్న చర్చ రైతుల్లో నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీలో దాదాపు 4.60 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఖరీఫ్‌కంటే రబీలో ధాన్యం దిగుబడి అధికంగా రానుంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఖరీఫ్‌లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూతన ధాన్యం కొనుగోలు విధానంలో రైతులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో పరిస్థితి అత్యంత ఘోరంగా కొనసాగింది. ఖరీఫ్ మాసూలు పూర్తయిన తర్వాత ధాన్యం రవాణాకు లారీలు లేక రైతులు పది నుంచి 20 రోజుల వరకూ వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. లారీలకోసం ప్రతీరోజు రైతుభరోసా కేంద్రాల చుట్టూ తిరగలేక రైతులు నరకయాతన పడ్డారు. ఇక ధాన్యం పట్టుబడికి గోనె సంచులు లేక రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితులు సైతం ఏర్పడ్డాయి. జట్టు కూలీలు దొరక దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా తేమశాతం పేరుతో రైతులను పెట్టిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రైతుభరోసా కేంద్రంలో అధికారులు రైతు పండించిన ధాన్యం నుంచి తేమ పరిశీలన చేసి 17 శాతం లోపే ఉందని నిర్ధారణ చేసేవారు. ధాన్యం విక్రయించి మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత తేమ 20శాతం ఉందంటూ ధాన్యం లోడు దింపకుండా నిలిపివేసిన సందర్భాలున్నాయి. పెరిగిన తేమశాతానికి తగిన సొమ్ములు రైతులు చెల్లించిన తర్వాత మాత్రమే ధాన్యంలోడు దింపుకున్న పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు మిల్లర్లకు ఎదురు డబ్బులు చెల్లించే దుస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు. ఇక తూకం విషయంలోనూ అదే పరిస్థితి నెలకొంది. అధికారులు సూచించిన వేబ్రిడ్జి వద్ద తూకం వేసిన తర్వాత కూడా మిల్లర్లు తూకం తగ్గిందని చెప్పి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లనమోదు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ధాన్యం సొమ్ములు భూ యజమాని ఖాతాలో పడటంతో కౌలురైతులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. పండిన పంటకు సరిపడు సంచులు ఇవ్వకుండా తొలుత 65 సంచులు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టడంతో అప్పుడు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రైతులు అనేక ఆందోళనలు చేసిన తర్వాత 75 సంచులు ఇస్తామని ప్రకటించారు. ముందు 12.5 ఎకరాల ఎకరాల వరకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని నిబంధన విధించి ఇబ్బందులకు గురిచేశారు. ఆ తర్వాత రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో మార్పుచేశారు. ఇలా అనేక సమ్యలతో ఖరీప్ ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రబీలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌బికె నిర్ధారించిన తేమ శాతమే ప్రాతిపదిక

ఆర్‌బికె నుంచి వచ్చిన అధికారులు ప్రకటించిన తేమశాతాన్ని నిర్ధారణగా తీసుకోవాలే తప్ప.. మిల్లు వద్దకు ధాన్యం చేరిన తర్వాత సమస్యలు సృష్టించడం వంటివి చేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తేమశాతంలో తేడాలు ఎందుకు వస్తున్నాయో గుర్తించి సింగిల్ విధానంలో తేమశాతం నిర్ధారణ జరగాలి. తేమశాతం పేరుతో మిల్లర్లు రైతుల నుంచి సొమ్ము వసూలు చేయకుండా కట్టడి చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. రబీలో అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో అవసరమైన సంచులు ఇచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. కౌలురైతుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదయ్యే విధంగా చూస్తే సగం సమస్యలు తగ్గనున్నాయి. 21 రోజుల్లోనే ధాన్యం సొమ్ములు జమయ్యే విధంగా చర్యలు చేపట్టాలి. ఖరీఫ్‌లో ఎదురైన సమస్యలను పరిగణనలోకి తీసుకుని రబీ ధాన్యం కొనుగోలు ప్రణాళికలు రూపొందిస్తేనే రైతులకు మేలు జరుగుతోంది.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పదిలో ఉత్తమ ఫలితాల కోసం 'విజయకేతనం'

జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.రవిసాగర్



ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఈ విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని, దీనికోసం పక్కా ప్రణాళికతో ముందుకుసాగుతున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.రవిసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ముఖాముఖీలో ఆయన పలుప్రశ్నలకు సమాధానం చెప్పారు.

ప్రశ్న : పదో తరగతి పరీక్షలు దగ్గరపడ్డాయి కదా.. విద్యార్థులను పరీక్షలకు ఎలా సన్నద్ధం చేస్తున్నారు?

పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకంగా 'విజయకేతనం' పేరుతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇది పూర్తిస్థాయిలో విజయవంతమైతే నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం ఖాయం.

ప్రశ్న : 'విజయకేతనం' ముఖ్య ఉద్దేశం.. దాని ఫలితాలు ఎలా ఉంటాయో చెబుతారా?



గతంలో ప్రతీఏడాది ప్రభుత్వం తరపు నుంచి ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా స్టడీ మెటీరియల్‌ను తయారు చేసి వాటిని ప్రింటింగ్ చేసి పదో తరగతి విద్యార్థులకు అందించి తద్వారా మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేశాము. అయితే ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఆ స్టడీ మెటీరియల్స్ ప్రింటింగ్ చేయడానికి అవరోధం ఏర్పడింది. దీనికి బదులుగా 'విజయకేతనం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని పదోతరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేశాం. ఈ విజయకేతనం కార్యక్రమం ఈనెల 20వ తేదీన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ఉదయం పాఠశాల ప్రారంభమైన తరువాత ముఖ్యమైన ప్రశ్నలను వారికి ఇచ్చి చదివించే ఏర్పాటు చేస్తాం. పాఠశాల ముగిసిన తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉదయం ఇచ్చిన ప్రశ్నలపై పరీక్ష నిర్వహిస్తాం. దీంతో విద్యార్థుల పరీక్షలు రాసే సమయానికి వారి సామర్థ్యం పెరుగుతుంది. అంతేకాకుండా ముఖ్యమైన ప్రశ్నలు వారు గుర్తుపెట్టుకుని పరీక్షల్లో రాసేందుకు వీలుంటుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రతిభ పెంచడమే లక్ష్యం.

ప్రశ్న : విజయకేతనం కార్యక్రమం ఎన్నిరోజులు నిర్వహిస్తారు?

ఈనెల 20వ తేదీన ప్రారంభమవుతుంది. దాదాపు పదో తరగతి పరీక్షలు మొదలయ్యే వరకూ అంటే 40 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ 40 రోజుల్లో ఇప్పటి వరకూ చదువులో వెనుకబడిన విద్యార్థులు సైతం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ఉపయోగపడుతుంది.

ప్రశ్న : ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్ ద్వారా విద్యాశాఖలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారా?

అన్ని శాఖల్లో కన్నా ముందుగా బయోమెట్రిక్ విధానం విద్యాశాఖలోనే ప్రారంభమైంది. ఈ అటెండెన్స్ ద్వారా పూర్తిస్థాయి సత్ఫలితాలు సాధిస్తున్నాం.

ప్రశ్న : జగనన్న విద్యాకానుక ద్వారా 2022-23 సంవత్సరానికి గాను విద్యార్థులకు అందాల్సిన అన్ని మెటీరియల్స్ అందించారా?

ఈ విద్యా సంవత్సరానికిగాను జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు అందాల్సిన స్టడీ మెటీరియల్, యూనిఫారం, బ్యాగులు పూర్తిస్థాయిలో అందించాము.

ప్రశ్న : వచ్చే విద్యాసంవత్సరంలో జగనన్న విద్యాకానుకలో మార్పులు ఏమైనా ఉన్నాయా?

వచ్చే విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుక ద్వారా అందించే యూనిఫారాలు కొత్త మెరుగులు దిద్దుకుంటుంది. బాలికలకు ప్రత్యేకమైన యూనిఫారమ్, బాలురుకు ప్రత్యేక యూనిఫారం ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. పాఠశాల తెరిచే సమయానికి వీటిని అందించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. టెక్స్ట్ పుస్తకాలు, డిక్షనరీ, యూనిఫారాలు, బూట్లు వంటివి ఈ విద్యాసంవత్సరం ఆఖరిలోనే అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక తయారు చేస్తుంది.

ప్రశ్న : జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు అంతా సిద్ధం చేశారా?

నూతనంగా ఏర్పడిన జిల్లాలో వైజ్ఞానిక ప్రదర్శనకు అంతా సిద్ధం చేశాం. ఈనెల 20, 21 తేదీల్లో ఏలూరులో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నాం. మొత్తం 28 మండలాల్లో ఉన్న పాఠశాలల నుండి విద్యార్థులు ఈ ప్రదర్శనకు హాజరవుతున్నారు గతంలో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనగా పిలవబడే ఈ కార్యక్రమం ఈ ఏడాది నుండి జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనగా మార్చబడింది. వీటిలో అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు పంపుతాము.

ప్రశ్న : ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ నుండి మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమైనా ఉన్నాయా?

అన్ని జిల్లాల్లో ఏలూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ ప్రత్యేకతను పరీక్షా ఫలితాల్లో చూపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. నూరు శాతం ఉత్తీర్ణతకు సహకరించాలి. ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని వసతులూ కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాను. వారికి ఏ సమస్యలున్నా నేరుగా నన్ను సంప్రదించండి. ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను.

చెట్టును ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కలిదిండి


ఆంజనేయులు


సుబ్రహ్మణ్యం

చెట్టును ఢీకొని ఇద్దరు ఇటుక బట్టీ కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మండలంలోని పడమటిపాలెంలో రాష్ట్రీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావు పేటకు చెందిన నక్కా సుబ్రహ్మణ్యం(23), కలిదిండి మండలం గుర్వాయిపాలేనికి చెందిన గండికోట ఆంజనేయులు(40) ఇద్దరూ గుర్వాయిపాలెంలోని ఇటుకల బట్టీలో పనిచేస్తుంటారు. పని ముగిసిన తర్వాత అర్ధరాత్రి ఇరువురూ ద్విచక్రవాహనంపై గుర్వాయిపాలెం నుండి కోరుకొల్లు వెళు తున్నారు. పడమటిపాలెం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నక్కా సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన గండికోట ఆంజనేయులును కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. నక్కా సుబ్రహ్మణ్యం భార్య ఇటీవల మృతిచెందింది. ఆంజనేయులుకు భార్య ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విఆర్‌ఒ జి.జయరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మణికుమార్ తెలిపారు.

నేడు స్పందన రద్దు రద్దు

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ నిర్వహిస్తున్న కారణంగా ఈనెల 20వ తేదీన నిర్వహించే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం రద్దు చేశామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో 'స్పందన' కార్యక్రమం 20వ తేదీన యథావిధిగా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

నేడు, రేపు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లా స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ వి.రవిసాగర్ తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్ పర్యావరణ హిత పదార్థాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌ల తయారీ, పర్యావరణ వాతావరణ మార్పులు, గణిత నమూనాలు అంశాల్లో 28 మండలా నుంచి ఎంపికైన 120 ఎగ్జిబిట్లు జిల్లా సైన్స్ ఫైయిర్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జయప్రదం చేసేందుకు ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సహాయ ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20వ తేదీ సోమవారం ఉదయం పది గంటలకు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

శ్రీవారి కొండపైన రోడ్లు అభివృద్ధి


ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


సుందరవనంగా ఉన్న రోడ్డు

శ్రీవారి దేవ స్థానం ద్వారకా తిరుమల కొండపైన రోడ్లను దేవస్థానం వారు అభివృద్ధి చేస్తున్నారు. కొండపైన రోడ్లను ఎంతో సుందరంగా నిర్మిస్తు న్నారు. శివాలయం నుంచి లింగయ్య చెరువు వరకు, అన్నదాన సత్రం నుంచి 120 గదుల సత్రం వరకు, సన్ డయల్ ప్రాంతం నుంచి అన్నదాన సత్రం వరకు, కొండపైన ఉన్న అన్ని రహదారులను దేవస్థానం వారు అభివృద్ధి చేస్తున్నారు. యాత్రికులు రోడ్లను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.మూడు కోట్లతో నాలుగున్నర కిలో మీటర్ల పొడవు గల రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. శ్రీవారి కొండపైన ఉన్న స్వామి వారి ఉద్యానవనంలో వృక్ష ప్రసాదంలో భాగంగా వివిధ రకాల మొక్కలు పెంచి యాత్రికులకు పంచి పెడుతున్నారు.

ఎస్‌ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రశాంతం

86.79 శాతం మంది హాజరు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఐజి పాలరాజు, ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరు పట్టణంలో ఏర్పాటు చేసిన 14 పరీక్ష కేంద్రాల్లో 9,014 మంది అభ్యర్థులకు 7,823 మంది అభ్యర్థులు హాజర య్యారు. 1,191 మంది అభ్యర్థులు గైర్హాజయ్యారు. మొత్తం 86.79 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఏలూరు రేంజ్ డిఐజి జి.పాలరాజు, జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగిందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే నిమిత్తంగా ఏలూరు రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి మ్యాప్ ద్వారా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను గుర్తించే వెసులుబాటు కల్పించామన్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు పోలీసు వారు చర్యలు తీసుకున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతించలేదని, ఏ విధమైన లోపాలూ లేకుండా పరీక్షలు సవ్యంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని డిఐజి తెలిపారు. ఈ తనిఖీల్లో ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్.పైడేశ్వరరావు, ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఏలూరు వన్‌టౌన్ సిఐ బి.ఆదిప్రసాద్, ఏలూరు త్రీ టౌన్ ఎస్‌ఐ వరప్రసాద్, అఖిల్ జామ పాల్గొన్నారు.

పోలీసుల సేవలు భేష్

ఎస్‌ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష రాసేందుకు ఏలూరు వచ్చిన అభ్యర్థులకు పోలీసులు ఉత్తమ సేవలందిం చారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేందుకు పోలీస్ యంత్రాంగం తమవంతు కీలకపాత్ర పోషించారు. ఒక అభ్యర్థిని ఏలూరు కొత్తబస్టాండ్ సమీపంలోని సర్‌సిఆర్‌ఆర్ అటానమస్ కాలేజీలో పరీక్ష రాయాల్సి ఉండగా ఆమె వట్లూరులోని సిఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రం వద్దకు వెళ్లింది. ఆమెకు కేవలం ఐదు నిమిషాలు మాత్రమే సమయం ఉండగా, తాను పరీక్ష రాయాల్సింది ఇక్కడ కాదని గుర్తించింది. తనకల నెరవేరకుండా పోతుందనే ఆందోళనతో తీవ్ర నిరాశలోకి వెళ్లిపోతున్న తరుణంలో ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్ పైడేశ్వరరావు స్పందించారు. నాలుగు కిలోమీటర్ల దూరాన్ని నాలుగు నిమిషాల్లోనే ఛేదించి ఆమెను తన కారులో అటానమస్ కాలేజీ పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆమె హాల్‌టిక్కెట్ నెంబర్‌ను సిఐ ఆదిప్రసాద్‌కు చెప్పటంతో ఏ రూముకు వెళ్లాలో అన్నీ సిద్ధం చేసి ఉంచారు. కారు దిగిన వెంటనే ఆమెను పరీక్ష గదికి చేర్చారు.

అలాగే చింతలపూడి పట్టణానికి చెందిన బేతం నాగలక్ష్మి పరీక్ష రాసేందుకు నగరానికి వచ్చింది. ఏలూరు శనివారపుపేట రోడ్డులోని సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రంలో ఆమె ప్రిలిమినరీ పరీక్ష రాయాల్సి ఉంది. ఎలాగైనా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలనే తపనతో పరీక్ష రాస్తోన్న నాగలక్ష్మి కళ్లు తిరగడం, వాంతులతో అనారోగ్యానికి గురైంది. పరీక్ష రాస్తూనే పడిపోయిన నాగలక్ష్మి పరిస్థితిని చూసిన ఏలూరు సిసిఎస్ సిఐ సిహెచ్.మురళీకృష్ణ, పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ సిహెచ్ పద్మజ వెంటనే స్పందించారు. ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడే వరకూ ఆమెకు వైద్య సేవలందేలా చర్యలు తీసుకున్నారు.

21న నారాయణపురంలో సర్వే

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - ఉండి రాష్ట్రీయ రహదారిలో నారాయణపురం బజారు వెంబడి సర్వే నంబరు 257లో ఆర్‌అండ్‌బి శాఖకు చెందిన భూమికి హద్దులు నిర్ణయించేందుకు ఈ నెల 21న సర్వే చేయనున్నారు. నారాయణపురంలో ఏలూరు కాలువపై ప్రస్తుతం ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రభుత్వం రూ.8.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్)లో భాగంగా నారాయణపురం బజారులో ఆర్‌అండ్‌బి స్థలానికి సర్వే చేసి మార్కింగ్ వేయనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం వంతెన నిర్మాణానికి కావాల్సిన స్థలం ఎంతుంది, ప్రయివేట్ భవనాలు, ఖాళీ ప్రాంతాలు ఎంతవరకూ ఉన్నాయో తెలియడం వల్ల వంతెన డిజైన్ రూపొందించడానికి వీలు కలుగుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21న ఆర్‌అండ్‌బి, పంచాయతీ, రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో సర్వేకు స్థానిక వ్యాపారులు, నివాసితులు సహకరించాలని టాంటాం ద్వారా ప్రచారం చేసి నోటీసులను పంచాయతీ అధికారులు జారీ చేశారు.

మద్ది ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆదివారం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నూతన వస్త్రాలు అందించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు కర్పూరం రవి, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కీసరి సరిత విజయ భాస్కర రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


పట్టిసీమ హుండీ ఆదాయం రూ.32.03 లక్షలు

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల హుండీ ఆదాయం రూ.32,03,336 వచ్చినట్లు ఆలయ కార్యదర్శి సంగమేశ్వరశర్మ తెలిపారు. ఆదివారం హుండీ లెక్కింపు నిర్వహించగా అంతరాలయ దర్శనానికి రూ.9,77,700, శీఘ్ర దర్శనానికి రూ.3,66,350, ప్రత్యేక దర్శనానికి రూ.3,27,180, కేశఖండనం రూ.1240, హుండీల ఆదాయం రూ.14,28,366, కొబ్బరి చెక్కల ఆదాయం రూ.1,00,500, తలనీలాల ఆదాయం రూ.ఆరు వేలు వచ్చినట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

బాధితులకు ఎంఎల్‌ఎ వాసుబాబు పరామర్శ


గండిశ్రీనును పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

జాతీయ రహదారిపై పూళ్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కురెళ్లగూడెం గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు చనిపోగా తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి గండికోట శ్రీను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్న ఎంఎల్‌ఎ వాసుబాబు గండి శ్రీను ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముగ్గురి మృతదేహాలకు ఆదివారం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తయింది. ఎంఎల్‌ఎ వాసుబాబు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. చనిపోయిన ఒక్కొక్క వ్యక్తి కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా పథకం కింద మంజూరయ్యే రూ.ఐదు లక్షలు త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వారి ఇతర డిమాండ్లను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ మాజీ ఛైర్మన్ గన్ని నాగగోపాలరావు, వైసిపి ప్రముఖులు రావిపాటి గాంధీ గోపాలకృష్ణ, జి.గురునాధరావు, భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్, గ్రామ రెవెన్యూ అధికారులు ఇంతియాప్, మార్కండేయులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతి తీరనిలోటు

సంస్మరణ సభలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమడోలు

కౌలు రైతు సంఘం నాయకులు గంజి నాగేశ్వరరావు మృతి కౌలు రైతు ఉద్యమానికి తీరని లోటని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. నాగేశ్వరరావు స్వగ్రామమైన భీమడోలు మండలం కోడూరుపాడులో ఆదివారం ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నాగేశ్వరరావు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాలకు రుణాల మంజూరు కోసం చేపట్టిన ఆందోళన కార్యక్రమలాల్లో నాగేశ్వరరావు ముందుండేవారన్నారు. గ్రామ సర్పంచిగా ఆయన హయాంలో ఇళ్ల స్థలాలు మంజూరు, రోడ్ల నిర్మాణాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. గ్రామస్తులు ఎవరికైనా వ్యక్తిగతంగా సమస్యలు ఎదురైతే అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి సహకరించేవారన్నారు. కౌలు రైతులు ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా సమన్వయకర్త కొర్ని అప్పారావు, సహ సమన్వయకర్త వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు జి.కృష్ణబాలాజీ పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి

ప్రజాశక్తి - గణపవరం

ఛత్రపతి శివాజీ నేటి యువతకు ఆదర్శమని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నంద్యాల రామలింగరాజు అన్నారు. ఛత్రపతి శివాజీ 391వ జయంతి సందర్భంగా స్థానిక పెద్ద వీధిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలుత శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మొగలాయిలను ఎదిరించి దక్షిణ భారత దేశాన్ని రక్షించిన మహావీరుడన్నారు. ఈ కార్యక్రమంలో పలివెల వెంకటశ్రీనివాస్, అచ్యుత భాస్కరరావు, వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

అభినందనీయులు సుబ్బరాజు

ప్రజాశక్తి - గణపవరం

ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా 29 ఏళ్లుగా అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక వేత్త సమాజసేవకులు, మానవతా వాది సాగిరాజు సుబ్బరాజు అభినందనీయులని డిఎన్ఆర్ కళాశాల డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. స్థానిక సువర్దేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం జరిగిన అఖండ అన్నసమారాధనలో పాల్గొని మాట్లాడారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, దెందుకూరి ప్రసాద్‌రాజు ప్రారంభించారు. రామలింగరాజు మాట్లాడుతూ గ్రామస్తులకు ఉచితంగా మంచినీరందిస్తున్నారన్నారు. సరిపల్లి నిలయంలో ప్రతిఏడాది శ్రీరామనవమి జరగడానికి ఆర్థికంగా సహకరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దెందుకూరి శ్రీనివాసరాజు, ఎం.సురేష్, వేమల బాలమురళి, మురళీరాజు, ఇంటి ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం : డిఎన్ఆర్

ప్రజాశక్తి - మండవల్లి

గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపన దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పుట్లచెరువు సచివాలయం పరిధిలో 177వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపన జగన్ వల్లే సాధ్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాక్షస పాలన సాగిందని విమర్శించారు. ఆ పాలనలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారన్నారు. నేడు రాజన్న పాలన నిర్విఘ్నంగా సాగుతుందన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందించేలా ప్రజలు జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, జెడ్పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, సర్పంచి గురుగుబిల్లి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు చేబోయిన వీర్రాజు, మండవల్లి పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, కానుకల సర్పంచి నాగదాసి థామస్, మాజీ ఎంపిపి ముంగర గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి దంపతులను మేళాతాళాల మధ్య కేరళ వాయిద్యాల నడుమ కోలాట నృత్య ప్రదర్శన చేస్తూ రథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి రథం లాగేందుకు అధిక సంఖ్యలో మహిళ భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ రమేష్‌రాజు మాట్లాడుతూ శివరాత్రి మహోత్సవంలో భాగంగా మూడో రోజు కళ్యాణ ఘట్టం ముగించుకుని నాలుగో రోజు స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పర్వతనేని మురళి, పసుమర్తి రాము, దేవరపల్లి సీతారామయ్య, కన్నం సర్వేశ్వరరావు, లింగారెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముసునూరు : కళ్యాణం - కమనీయం అంటూ బలే శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణం ఆంగరంగా వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి 11 గంటలకు అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు, చావలి అరుణబాబు కళ్యాణ మహోత్సవం ఆలయ ఇఒ తల్లాప్రగడ విశ్వేశరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బలివే ఉత్సవాల హుండీ లెక్కింపు ఆదివారం ఆలయ కార్యనిర్వహణాధికారుల ఆధ్యరంలో నిర్వహించారు.

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల : శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ద్వారకా తిరుమల గ్రామ క్షేత్ర పాలకుడు అయిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి గ్రామోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి కళ్యాణోత్సవం నిర్వహించారు. సోమవారం శ్రీ స్వామి వారి వసంతోత్సవం నిర్వహించనున్నారు.

ఆటపాకలో అన్న సమారాధన

కైకలూరు :మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆటపాక శివాలయంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు శ్రీ కనకలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డన చేశారు.

నేరాలు - ఘోరాలు

బలివే ఉత్సవాలకు వచ్చిన

బాలుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ముసునూరు/పెదవేగి

ఎలా వచ్చాడో.. ఎవరూ తీసుకొచ్చారో తెలీదు.. ఎప్పుడోచ్చాడో తెలీదు... బలివే ఉత్సవాల్లో ఆదివారం తెల్లవారుజామున బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికంగా కలకలం సృష్టించిన ఈ ఘటన సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరానికి చెందిన బాలుడు ఎం.నాగవెంకటరమణ (17) బలివే ఉత్సవాలకు వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పెదవేగి మండలం విజయరాయి శివారులో బలివే ఉత్సవాల సందర్భంగా లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన జనరేటర్ వద్ద మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బంధువులకు సమాచారం అందిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పాతూరు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గాయాలపాలైన మరొకరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఏలూరు తరలించారు. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... గుండుగొలను శివారు దెందులూరు మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన సమీప బంధువులు అప్పలనాయుడు, ఐ.సన్యాసిరావు మార్కెట్ పని నిమిత్తం గుండుగొలను నుంచి పాతూరు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. వారు పాతూరు గ్రామంలోకి ప్రవేశించే క్రమంలో తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్లే లారీ వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న మంత్రి అప్పలనాయుడు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారు వాహనాన్ని నడుపుతున్న సన్యాసిరావు తీవ్ర గాయాలపాలయ్యారు. అప్పలనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రిషియన్ మృతి చెందిన ఘటన ముసునూరులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన కోరు సుందరరావు (55) ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తాడు. ఈ క్రమంలో ముసునూరులోనే ఆదివారం ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుందరరావు మృతితో ముసునూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా..!

జల్లేరు వాగు దాటేందుకు ప్రజల అవస్థలు
తరచూ పలు ప్రమాదాలు
అధికారులు స్పందించాలని వేడుకోలు



నిర్మాణం పూర్తి కాని వంతెన ఇదే...

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని పట్టిన్నపాలెం రామారావు పేట సెంటర్‌కు మధ్యలో ఉన్న జల్లేరు వాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ వంతెనకు 2018 తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ.ఐదు కోట్ల వ్యయంతో పీతల సుజాత శంకుస్థాపన చేశారు. 50 శాతం కంటే ఎక్కువగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కాని ఈ వంతెన ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో బుట్టాయగూడెం మండలంలోని గిరిజన ప్రాంతంలోని గ్రామాలైన రెడ్డి గణపవరం, బెడదనూరు, వెలుతురువారిగూడెం, జగ్గిసెట్టిగూడెం, నాగులగూడెం, అంతర్వేదిగూడెం, కామవరం, పూచికపాడు, అంకన్నగూడెం వంటి గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు ఈ రోడ్డు మార్గం ద్వారానే జంగారెడ్డిగూడెం వెళ్లాలి. వర్షాకాలంలో కొండల్లో ఎక్కువగా వర్షం పడటం వల్ల దొర మామిడి డ్యాం గేట్లు ఎత్తడంతో అధిక మొత్తంలో నీరు ఈ జల్లేరు కాలువ ద్వారా ఎక్కువగా వస్తుంది. దీంతో ఈ వంతెన వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం పోలీసులను, రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేస్తుందే కానీ వంతెన నిర్మించడంలేదని ప్రజలు వాపోతున్నారు. పొగాకు బ్యారన్ సీజన్ కావడంతో రైతులు పొగాకు బేళ్లను జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి కేంద్రాలకు అమ్మకానికి తీసుకువెళ్తారు. ఈ వంతెన నిర్మాణం కాకపోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కనీసం అధికారులు స్పందించడంలేదని రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. వచ్చే నెలలో రెడ్డి గణపవరం గ్రామంలో దుర్గమ్మ తిరణాలు జరుగుతాయని, ఈ తిరణాలకు జంగారెడ్డిగూడెం ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గం గుండానే భక్తులు రావడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. ఆయా గిరిజన ప్రాంతాల్లో ఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు ఈ వంతెన నిర్మించకపోవడంతో బుట్టాయగూడెం నుంచి తీసుకెళ్లడానికి ఎక్కువ సమయం పడుతుందని, దీంతో వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ హై లెవెల్ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరతగతిన వంతెన నిర్మించాలి

తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు




మా గిరిజన ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రయణించే ఈ మార్గంలో ఉన్న హై లెవెల్ వంతెనను త్వరితగతన పూర్తి చేయాలి. ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పుడైనా స్పందించి ఈ వంతెనను త్వరగా పూర్తి చేయకపోతే ఆయా గ్రామాల్లోని ప్రజలతో, రైతులతో కలిసి ఉద్యమం చేస్తాం. ఈ ప్రాంతా ల్లోని ప్రజలు అనారోగ్యానికి గురైతే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన వద్ద పలుమార్లు ఎన్నో ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. శంకుస్థాపన చేసి ఐదేళ్లు పూర్తవుతున్నా ఎందుకు నిర్మాణం పూర్తి చేయడంలేదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ప్రభుత్వం స్పందించి త్వరితగతిన వంతెన నిర్మించాలి.

ప్రత్యేక పంచాయతీ సాధనకు పోరాటం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎర్రకాలువ వెలుపల గ్రామాల ప్రత్యేక పంచాయతీ సాధనకు ప్రజలంతా ఏకం కావాలని ప్రత్యేక పంచాయతీ సాధన కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని పుట్రేపు, రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెం, ప్రకాష్ నగర్, కృష్ణాపురం గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా గ్రామాలకు చెందిన యువకులు చేస్తున్న పోరాటంలో భాగంగా ఆదివారం రుద్రకోటరాజుగూడెంలో యువకులు, పెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక పంచాయతీతో ఆరు గ్రామాలకు అన్ని రకాల అబివృద్ధి చేకూరుతుందన్నారు. పోరాటంలో ప్రతిఒక్కరూ బాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికే పంచాయతీ అధికారుల నుంచి ఎంపి, ఎంఎల్ఎ, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ నెల 23న పుట్రేపులోని బడివద్ద ఆరు గ్రామాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశామని, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భుక్యా వేణు, అర్జా సాగర్, కుంజా రవికిరణ్, తాడేపల్లి చందు, బత్తుల నవీన్, బి.రామకృష్ణ, నంబూరి నాగేంద్ర, నత్తా మనోజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువకులు

'పిన్నమనేని' ఆధ్వర్యాన మెగా వైద్యశిబిరం



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - మండవల్లి

పిల్లల్లో ఎదురయ్యే ఆరోగ్యపరమైన సమస్యలను నివారించేందుకే వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందిస్తున్నామని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిన్నమనేని ఎడ్యుకేషనల్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పిల్లల మెగా వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు మరణానంతరం 2013లో ట్రస్ట్ ఏర్పాటు చేసి పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందించనున్నట్లు తెలిపారు. కోవిడ్ అనంతరం పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ట్రస్టు దృష్టికి రావడంతో ట్రస్ట్ సభ్యులంతా తీర్మానించి పిల్లల్లో తలెత్తే సమస్యలను నివారించే విధంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించే విధంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు శిబిరాలని ఏర్పాటు చేసి వైద్యులను తీసుకువచ్చి వైద్యం అందిస్తున్నామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ప్రసూన్ కొర్రపాటి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ బి.రాజు, డాక్టర్ శివరామకృష్ణ వైద్య సేవలందించారన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు 400 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని వీరయ్య చౌదరి(బాబ్జి), మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, కైకలూరు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, టిడిపి మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు, సర్పంచి మెండ ఝాన్సీ, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదేశిస్తే కైకలూరు నుంచి పోటీ చేస్తా

చంద్రబాబు నాయుడు ఆదేశిస్తే కైకలూరు నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కైకలూరు నియోజకవర్గంలో పిన్నమనేని కుటుంబం తెలియని వారు లేరన్నారు. తన తండ్రి కీర్తిశేషులు పిన్నమనేని కోటేశ్వరరావు, కో-ఆప్షన్ మెంబర్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారన్నారు. ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో కోటేశ్వరరావుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. పిన్నమనేని వీరయ్య చౌదరి (బాబ్జి) మాట్లాడుతూ బాబాయ్ వస్తాడా కొడుకు వస్తాడా అని సాంఘిక మాధ్యమాల్లో చర్చలు జరగడం, వార్తలు రావడం తన దృష్టికి వచ్చిందన్నారు. సీటు ఎవరికి ఇచ్చినా కట్టుబడి పని చేసుకుంటామన్నారు. పార్టీ నిర్ణయం మేరకే పోటీ చేసి గెలిచి చంద్రబాబునాయుడుకు కైకలూరు నియోజకవర్గం స్థానాన్ని బహుమతిగా ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఎక్కడ వేసిన గొంగలి అక్కడే..!

నారాయణపురంలో ప్రారంభం కాని జగనన్న ఇంటి నిర్మాణాలు
2.75 ఎకరాల్లో పూడిక పూర్తి
మరో 2.68 ఎకరాల్లో నిలిచిన మెరక పనులు
స్థలాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఉంగుటూరులో మెరక చేసిన స్థలం

అర్హులందరికీ సొంతిళ్లే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయాలు ఉంగుటూరు మండలం నారాయణపురంలో నెరవేరేందుకు అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయి. నారాయణపురంలో తొలిదశలో స్థానిక ఎన్‌టిఆర్ కాలనీని ఆనుకుని ఉన్న కొల్లేరు తాగునీటి పథకం ఖాళీ భూమిని రెండున్నర ఏళ్ల క్రితం మెరక చేసి సగం మంది లబ్ధిదారులకైనా స్థలాలు ఇచ్చేందుకు నాయకులు, అధికారులు ప్రయత్నాలు చేశారు. కోర్టు తీర్పు కారణంగా ఇళ్లస్థలాల పంపిణీ ఆగిపోయింది. అనంతరం తల్లాపురం, అప్పారావుపేటల్లో ప్రభుత్వ పోరంబోకు భూముల్లో మెరక చేసి స్థలాల కోసం కేటాయించినా, గ్రామానికి సంబంధం లేని విధంగా సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ స్థలాల్లోకి లబ్ధిదారులు వెళ్లడంలేదు. దీంతో భూమి కోసం అధికారులు, నాయకులు వెతులాడినా ఫలితం లేకుండా పోయింది.

ఎట్టకేలకు 5.90 ఎకరాలు కొనుగోలు చేసిన ప్రభుత్వం

నారాయణపురంలో ఎక్కడా భూమి లభ్యం కాకపోవడంతో ఉంగుటూరు రెవెన్యూ గ్రామానికి చెందిన రెండు వేర్వేరు చోట్ల 5.90 ఎకరాల భూమిని ప్రభుత్వం ఎకరం రూ.54 లక్షల వంతున కొనుగోలు చేసి దాదాపు రెండేళ్లు దాటింది. ఇందులో 2.78 ఎకరాల్లో సుమారు ఆరు అడుగుల మేర మెరక పనులకు ప్రభుత్వం రూ.67 లక్షలు మంజూరు చేయడంతో మట్టి కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ప్రస్తుతం పూడిక పనులు ముగింపు దశక చేరాయి. ఇంకో 2.68 ఎకరాల్లో ప్రస్తుతం జామాయిల్ తోట ఉంది. అందులో చెట్లను తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు టెండర్లు రావడంలేదు. ఆ చెట్లు తొలగిస్తే కాని పూడిక పూర్తి కాదు. ఆ చెట్లు ఎప్పుడు నరికించి పూడిక చేసి స్థలాలు ఇస్తారో, ఈలోగా ఎన్నికలు హడావుడిలో పనులు ఎంతవరకు పూర్తవుతాయోనని అనుమానాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం పూడిక చేసిన లేఅవుట్‌లో స్థలాలు పంపిణీ చేసేసి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం 210 మందికి పైగా లబ్ధిదారుల గుర్తింపు

నారాయణపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులను 210 మందికి పైగా అధికారులు గుర్తించారు. ఇంకా లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా నారాయణపురంవారికి ఉంగుటూరులో స్థలాలు ఇవ్వడం వల్ల భవిష్యత్తుల్లో ఇక్కడి వాళ్లంతా ఉంగుటూరు గ్రామానికే ఇంటి, నీటి పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ఓటు హక్కు కూడా ఉంగుటూరులోకి వెళ్లిపోతాయి. ఆ మేరకు నారాయణపురం జనాభా, ఓటర్ల సంఖ్య మారే అవకాశం లేకపోలేదు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైకలూరు :చిగురుకోట 132/33 కెవి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 20వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్ శాఖ అధికారి టి.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపి వేస్తామన్నారు. కలిదిండి, పోతుమర్రు, కోరుకొల్లు, మూలలంక, వరాహపట్నం, పల్లెవాడ, చిగురుకోట సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.